క్లుప్తంగా

ముగిసిన ఆధార్ నవీకరణ శిబిరాలు

కపిలేశ్వరపురం (మండపేట): ఈ నెల 5 నుంచి రెండు విడతలుగా నిర్వహించిన ప్రత్యేక ఆధార్ నవీకరణ శిబిరాలు గురువారంతో ముగిశాయి. చివరి షెడ్యూల్‌గా ఎంపీడీఓ జి.రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో 14, 15 తేదీల్లో కపిలేశ్వరపురం, అంగర, నేలటూరు గ్రామ సచివాలయాల్లో నవీకరణ ప్రక్రియను చేపట్టారు. ఆయా కేంద్రాల్లో కపిలేశ్వరపురం, వల్లూరు, టేకి సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీర మల్లేశ్వరరావు, కోరా దొరబాబు, అల్లక ఫణీంద్రలు 125 మందికి చెందిన ఆధార్ వివరాలను నవీకరించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

మండపేటలో...

మండపేట పట్టణంలో మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు పర్యవేక్షణలో రెండో విడత ఆధార్ నవీకరణ శిబిరాలు ముగిశాయి. తరవాణీపేటలోని శ్రీరామ హిందూ మున్సిపల్ పాఠశాల వెనుక ఉన్న 2వ సచివాలయం, గొల్లలగుంటలోని 1వ సచివాలయంలో నిర్వహించిన శిబిరాల్లో ఆరేళ్ల లోపు చిన్నారులకు బాల ఆధార్ నమోదు, 5–15 వయస్సుగల బాలబాలికలకు బయోమెట్రిక్ అప్‌డేట్ ప్రక్రియలను డిజిటల్ అసిస్టెంట్లు పూర్తి చేశారు.

చలివేంద్రం ప్రారంభం



మండపేటలో మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకుడు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలో శ్రీకామాక్షి వడ్రంగి యువజన సంఘ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. దీనికి పట్టణానికి చెందిన శ్రీవైష్ణవి విద్యా సంస్థల వ్యవస్థాపకుడు కోనె వీర్రాజు మజ్జిగను పంపిణీ చేశారు. దాతల సహకారంతో మూడేళ్లుగా వేసవిలో యువజన సంఘం చలివేంద్రాన్ని నిర్వహించడాన్ని పలువురు అభినందించారు. సంఘ అధ్యక్షుడు గోడి సుబ్రహ్మణ్యం, కోశాధికారి తామరపల్లి సూరిబాబు, నాయుడు శ్రీను, కోన సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కపిలేశ్వరపురం: అంగర 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఆ శాఖ రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. సబ్ స్టేషన్ వద్ద బ్రేకర్ల నిర్మాణ పనుల నిమిత్తం కపిలేశ్వరపురం, అంగర, టేకి, వెదురుమూడి, పడమర ఖండ్రిక, మాచరమట్టలు, శ్రీరామపురం, నల్లూరు, కాలేరు, సుభద్రాపురం, వల్లూరు, నేలటూరు గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు మండపేటలో..

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం అంతరాయం కలుగుతుందని ఆ శాఖ రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. పట్టణంలోని బైపాస్ రోడ్డు, ఏడిద రోడ్డు, వీరభద్రపురం, ఆర్టీవో కార్యాలయం రోడ్డు, రాజీవ్ గృహకల్ప కాలనీ, బస్టాండ్ రోడ్డు, సంగం కాలనీ, విజయలక్ష్మి నగర్, సత్యశ్రీ థియేటర్ రోడ్డు, మెయిన్ రోడ్డు, తర్వాణిపేట, పెద్ద కాలువ వంతెన, బ్యాంకు కాలనీ, శ్రీలక్ష్మీనగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

చిన్నారులపై శ్రద్ధ చూపండి

కపిలేశ్వరపురం: చిన్నారుల మానసిక స్థితిగతులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్టు అంగర సెక్టార్ సూపర్‌వైజర్ పి.వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని వెదురుమూడిలో బుధ, గురువారాల్లో రెండు రోజుల పాటు ఐసీడీఎస్, శ్రమ స్వచ్ఛంద, ప్రథమ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సంసిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అభ్యాసనాన్ని పూర్తి చేసుకొని పాఠశాల విద్య కోసం చిన్నారులను సంసిద్ధం చేసే ప్రక్రియపై తల్లులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్త ఎం.జానకి తదితరులు చిన్నారుల తల్లిదండ్రులకు పలు అంశాలను వివరించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి గజలక్ష్మి పర్యవేక్షణలో ర్యాలీ నిర్వహించారు. ప్రథమ్ ప్రతినిధి సత్యనారాయణ, శ్రమ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నాగేశ్వరి పలు సామాజిక అంశాలపై ప్రసంగించారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

కాజులూరు: మండలంలోని పెనుమళ్ళలో మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఒక మహిళ మెడలోని బంగారు గొలుసును ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, గొల్లపాలెం పోలీసులు తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. అండ్రంగికి చెందిన బండారు త్రిమూర్తులు, అతని భార్య సూర్యకాంతంలు గురువారం తెల్లవారు నాలుగు గంటల సమయంలో తమ బైక్‌పై బంధువుల ఇంటికి వెళ్తుండగా, పెనుమళ్ళ గ్రామ శివారు వచ్చేసరికి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వెనుక నుంచి సూర్యకాంతం మెడలోని 52 గ్రాముల బంగారు పుస్తెలతాడు, నల్లపూసల దండ బలవంతంగా లాక్కునిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు గొల్లపాలెం ఎస్‌ఐ ఎం.మోహన్‌కుమార్ తెలిపారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం

- నిరుపయోగంగా రైల్వే క్వార్టర్స్
- వృథాగా ప్రజాధనం
- ఏళ్లు గడుస్తున్నా వినియోగంలోకి రాని భవనాలు



కె.గంగవరం మండలం కోటిపల్లిలో నిరుపయోగంగా ఉన్న రైల్వే భవనాలు

కె.గంగవరం: రూ.కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన రైల్వేశాఖ క్వార్టర్స్ ప్రస్తుతం నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రస్తుతం రైల్వేశాఖ భవనాలు ప్రారంభం కాకుండానే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. నియోజకవర్గంలోని రామచంద్రపురం పట్టణం, కె.గంగవరం మండలాల్లో సుమారు రూ.3 కోట్ల ప్రజా ధనంతో 2002వ సంవత్సరంలో భవనాలను నిర్మించారు. అయితే ప్రస్తుతం ఇవి ఎందుకూ పనికిరాకుండా దర్శనమిస్తున్నాయి. ఇందులో కె.గంగవరం మండలం కోటిపల్లి వద్ద నిర్మించిన రెండు రైల్వే కార్టర్స్ కనీసం ప్రారంభానికి కూడా నోచుకోలేదు. భవనాల నిర్మాణం కూడా అసంపూర్తిగా ఉంది. రాత్రి సమయాల్లో పట్టణంతో పాటు కె.గంగవరంలోని రైల్వే భవనాల వద్ద అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం భవనాల లోపల తుప్పలు పెరిగాయని, విషసర్పాలు, విషకీటకాలు సంచరిస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు.

అసంపూర్తిగా పనులు

2001లో అప్పట్లో కేంద్ర రైల్వేశాఖ మంత్రి మమతా బెనర్జీ ఈ ప్రాంతంలో రైల్వే లైన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. పనులు కూడా పూర్తయ్యాయి. అయితే కోటిపల్లి–నరసాపురం రైల్వే లైన్ పలు కారణాల వల్ల నిర్మాణం జరగలేదు. దీంతో స్థానికంగా ఉన్న క్వార్టర్స్ పూర్తిగా నిరుపయోగంగా మారిపోయాయి. ఈ ప్రాంతంలో రైల్వే వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. అయితే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఈ రైల్వే లైనుకు కొంత నిధులు మంజూరు చేసినా, ఈ రైల్వే వంతెన పూర్తి కావడానికి మరో నాలుగైదు సంవత్సరాలు పడుతుందని స్థానికులు చెబుతున్నారు. అప్పటి వరకు ఈ భవనాలు పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరుకుంటాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామచంద్రపురం పట్టణంలో ఉన్న ఆయా భవనాలను వినియోగంలోకి తీసుకొచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గత 16 ఏళ్లుగా ఈ రైల్వే భవనాలు నిరుపయోగంగా మారడం, ప్రస్తుతం శిథిలావస్థకు చేరే స్థితిలో ఉన్నాయని చెబుతున్నారు. దీంతో పాటు కోటిపల్లి రైల్వే లైను పూర్తి కావడానికి ఇంకా ఎన్నేళ్లు పడుతుందోనని స్థానికులు చెబుతున్నారు.

అధికారులు స్పందించాలి



రైల్వే భవనాలు నిరుపయోగంగా మారకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాలు శిథిలావస్థకు చేరకముందే వినియోగంలోకి తీసుకువస్తే బాగుంటుంది.

– పెట్లా శ్రీనివాస్, మాజీ ఎంపీపీ

రైల్వే లైన్ పూర్తి చేయాలి



కోటిపల్లి రైల్వే లైన్‌ను వీలైనంత త్వరగా ప్రభుత్వం పూర్తి చేయాలి. ఇప్పటికే కోట్లు ఖర్చు పెట్టి వేసి ప్రస్తుతం కాకినాడ–కోటిపల్లి రైల్వే లైను అంతంతమాత్రంగా వినియోగంలో ఉంది. ఈ లైను కోసం ఏర్పాటు చేసిన భవనాలు కొంతవరకు ఉపయోగంలోకి రావాలంటే రైల్వే లైను పూర్తి చేయాలి.

– రెడ్డి జయరాజు సుందరపల్లి

పిడుగుపడి కౌలురైతు మృతి



బాలకృష్ణ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కాజులూరు: కాకినాడ జిల్లా కాజులూరు మండలం జగన్నాథగిరిలో గురువారం పిడుగు పడి కపిలేశ్వరపురానికి చెందిన బుక్కే బాలకృష్ణ (35) అనే కౌలురైతు మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించిన స్థానికులు, గొల్లపాలెం పోలీసులు తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. కపిలేశ్వరపురానికి చెందిన బుక్కే బాలకృష్ణ రామచంద్రపురం మండలం కాపవరంలో నివాసముంటున్నాడు. పెనుమళ్లలో వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. ఆ సమయంలో పొలం పనులు చేస్తుండగా వర్షం కురుస్తుండడంతో సమీపంలో చెట్టు నీడకు వెళ్లాడు. ఒక్కసారిగా చెట్టుపై పిడుగు పడడంతో అక్కడే ఉన్న బాలకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి గొల్లపాలెం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలకృష్ణకు భార్య ప్రేమ, ఇద్దరు కుమారులున్నారు. ఈ సంఘటనపై గొల్లపాలెం ఎస్‌ఐ ఎం.మోహన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేనేత సహకార సంఘాలను ఆదుకోవాలని వినతి

రామచంద్రపురం రూరల్: రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల లివరీ చేనేత సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ దొంతంశెట్టి సత్యప్రకాశ్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన వివిధ పథకాల బాపతు బకాయిలు సుమారు రూ. 260 కోట్లు తక్షణం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడలో బుధవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత ప్రతినిధుల సమావేశంలో చేనేత సహకార సంఘాల సమస్యలు, పరిష్కార మార్గాలపై జరిగిన చర్చ సందర్భంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల తరఫున వినతిపత్రం అందజేసినట్టు ఆయన గురువారం విలేకరులకు తెలిపారు. చేనేత, జౌళి శాఖా మంత్రి సంజీవరెడ్డిగారి సవితకు ఉమ్మడి తూర్పుగోదావరి చేనేత సంఘాల నాయకులతో కలసి వినతి పత్రం అందజేశామన్నారు. దీంతో పాటు చేనేత సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని, 2018లో జరిగిన చీరాల డిక్లరేషన్ కింద ఇచ్చిన 6 జీవోలను అమలు చేయాలని, ఆప్కోను పునరుద్ధరించడానికి చేనేతపై జీఎస్టీ తొలగించడానికి చర్యలు తీసుకోవాలని మంత్రి సవితను కోరినట్టు తెలిపారు. విజయవాడ కార్యక్రమంలో తనతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచి సంఘం ప్రతినిధులు దొడ్డిపట్ల గణేష్, వాసా వీర్రాజు, అల్లక రాజు, ఎస్.ధనరాజు, ఎస్ సుబ్రహ్మణ్యం, సీహెచ్ వీర్రాజు, ఎస్. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు

తాళ్లరేవు: మత్స్యకార మహిళలు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కె.జి. శ్రీనివాసరావు కోరారు. కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామంలోని గోదావరి మహాసమాఖ్య కార్యాలయంలో గురువారం నిర్వహించిన మత్స్యకార మహిళల అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారులకు అందిస్తున్న పథకాలను వివరించారు. మత్స్యకార మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక పురోభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు.

అపర భగీరథుడు కాటన్



కేశవరంలో కాటన్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న వెంకన్నబాబు తదితరులు



పసలపూడి లాకుల వద్ద కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న త్రినాథరెడ్డి తదితరులు



నదురుబాదలో కాటన్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిరిపురపు తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు అన్నారు. గురువారం కేశవరంలో కాటన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకన్నబాబు మాట్లాడుతూ గోదావరి జిల్లాలు పచ్చని పొలాలతో సుభిక్షంగా ఉండడం వెనుక కాటన్ శ్రమ ఉందన్నారు. ఆయనను భవిష్యత్ తరాల వారు గుర్తించుకోవాలన్నారు. ఎంపీటీసీ అన్నందేవుల కృష్ణ, నాయకులు తుపాకుల ప్రసన్నకుమార్, అబ్బిరెడ్డి వీర్రాజు, ముక్కపాటి శ్రీనివాస్, అల్లంపల్లి కిశోర్, సలాది శివ, అద్దంకి రమణ, కూసు దొరాజి, పరిమి శ్రీను, రాయపాటి సత్యనారాయణ, చల్లా సూర్యనారాయణ పాల్గొన్నారు. మండపేట పట్టణ బైపాస్ రోడ్డులోని కాటన్ విగ్రహం వద్ద వల్లూరి పాపారావు ఆధ్వర్యంలో కాటన్ జయంతిని నిర్వహించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడారు.

కపిలేశ్వరపురం మండలంలో..

మండలంలోని తాతపూడి, పడమర ఖండ్రిక, వల్లూరు, అంగర, కపిలేశ్వరపురం తదితర గ్రామాల్లోని కాటన్ విగ్రహాలకు రైతులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పలు ప్రజా సంఘాల నేతలు మాట్లాడుతూ ధవళేశ్వరం బ్యారేజీ నిర్మాణంతో గోదావరి తీర ప్రాంతాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారన్నారు.

కాటన్ సేవలు చిరస్మరణీయం

రాయవరం: ఉభయగోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన కాటన్ దొర చిరస్మరణీయుడని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొవ్వూరి త్రినాథరెడ్డి అన్నారు. మండలంలోని పసలపూడి లాకుల వద్ద సర్ ఆర్థర్ కాటన్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా త్రినాథరెడ్డి మాట్లాడుతూ కాటన్ మహాశయుడు ప్రతి తెలుగు రైతు గుండెల్లో గూడు కట్టుకున్నాడన్నారు. కాటన్ ముందు చూపును అందిపుచ్చుకున్న ఘనత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. తొలుత కాటన్ విగ్రహానికి త్రినాథరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు నల్లమిల్లి వెంకటరెడ్డి, స్థానికులు, రైతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నదురుబాదలో మండపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాటన్ జయంతిని నిర్వహించారు.

మట్టి పరీక్షలు... ఎంతో మేలు

- జీపీఎస్ విధానంలో నిర్వహణ
- సాగులో రైతులకు ఆసరా



జీపీఎస్ విధానంలో మట్టిని సేకరిస్తున్న మండల వ్యవసాయ శాఖ సిబ్బంది

రాయవరం: సాగుబడిలో భూసార పరీక్షలు ఎంతో కీలకం.. మనిషి ఆరోగ్యాన్ని తెలుసుకునేందుకు పరీక్షలు ఎంత అవసరమో.. భూసారాన్ని తెలుసుకునేందుకు కూడా మట్టి పరీక్షలు అంతే అవసరం. భూసారాన్ని తెలుసుకునే మట్టి పరీక్షలను జీపీఎస్ విధానం ద్వారా నిర్వహిస్తున్నారు. నింగి నుంచి నిర్వహించే నేల పరీక్షలతో భూసారాన్ని తెలుసుకోవడం క్షణాల్లో పనిగా వ్యవసాయాధికారులు చెబుతున్నారు. జీపీఆర్ఎస్ విధానంలో చేపట్టే నేల పరీక్షలను మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ వివరిస్తున్నారు.

జీపీఆర్ఎస్ విధానంలో..

గతంలో మట్టి పరీక్షలను సంప్రదాయ పద్ధతిలో నిర్వహించేవారు. ఆసక్తి కనబర్చిన రైతుల పొలాల్లో మట్టిని సేకరించి భూసార పరీక్ష కేంద్రానికి పంపించేవారు. ఇప్పుడు జీపీఎస్ (గ్లోబల్ పొజిషన్ సిస్టమ్) విధానంలో జియో పరికరం ద్వారా మట్టిని ఏ ప్రదేశంలో సేకరిస్తున్నారో అక్షాంశాలు, రేఖాంశాల ద్వారా రీడింగ్స్‌ను నమోదు చేస్తారు. మట్టి నమూనాలను పాత పద్ధతిలోనే సేకరించి వాటిని భూసార పరీక్ష కేంద్రాలకు తరలిస్తారు. మట్టిని సేకరించే రైతుల సెల్ నంబర్లు, ఆధార కార్డు నంబర్లను తీసుకుంటారు. భూసార పరీక్ష ఫలితాలను నేరుగా సెల్‌కు మెసేజ్ రూపంలో సంక్షిప్త సమాచారాన్ని పంపిస్తున్నారు.

అంతా ఆన్‌లైన్‌లోనే..

మట్టి నమూనాల సేకరించిన రైతుల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. వచ్చిన ఫలితాలను కూడా భూసార పరీక్ష కేంద్రాల్లో ఆన్‌లైన్‌లోనే పొందుపరుస్తారు. దీనివల్ల రైతులు తమ ఆధార్‌కార్డు నంబరు సాయంతో గాని, వారికి కేటాయించిన ప్రత్యేకమైన నంబరుతో అగ్రిస్‌నెట్ వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఏజీఆర్ఐఎస్ఎన్ఈటీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా పూర్తి సమాచారాన్ని తెలుసుకోవచ్చు. రైతుకు సంబంధించిన భూమి వివరాలు, ఆ భూమి ఎక్కడ ఉంది, ఆ భూమి స్థితిగతులు, పోషకాల లభ్యత, పోషక లోపాలకు తీసుకోవాల్సిన ఎరువుల యాజమాన్య పద్ధతుల గురించి తెలుసుకోవచ్చు. భూసార పరీక్ష కేంద్రం వారు శాటిలైట్ ద్వారా సేకరించిన సమాచారాన్ని బట్టి గ్రామంలో పోషకాల లభ్యతా వివరాలను బట్టి గ్రామ భూసార స్థితిని తెలియజేసే పటాలను తయారు చేసి వాటిని రైతులకు కన్పించేలా సమాచారాన్ని ప్రదర్శిస్తారు. దీనివల్ల రైతులు భూసారాన్ని తెలుసుకోవడానికి, అందుకనుగుణంగా యాజమాన్య పద్ధతులను పాటించేందుకు వీలుంటుంది.

ఎంతో ఉపయుక్తం



జీపీఎస్ విధానంలో మట్టి నమూనాలు తీయడం రైతులకు ఎంతో ఉపయుక్తం. దీని వల్ల గ్రామంలోని భూసారానికి సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుంది. సాగులో ఈ విధానం రైతులకు ఆసరాగా మారింది.

–కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

అవగాహన అవసరం

కపిలేశ్వరపురం (మండపేట): నీటి సంఘాల ప్రతినిధులకు ఇరిగేషన్ పనులపై అవగాహన అవసరమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేటలోని తన కార్యాలయంలో గురువారం ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల పాలక ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఇరిగేషన్ పనుల కోసం రూ.1.16 కోట్లు, డ్రెయిన్స్ పనులకు రూ.1.19 కోట్లు మంజూరైనట్టు ఎమ్మెల్యే తెలిపారు.

ఆలయ భూములకు 17న వేలం

ఆలమూరు: గ్రామంలోని మూడు దేవాలయాలకు సంబంధించి భూములను మూడేళ్ల పాటు సాగు చేసేందుకు 17న వేలం పాటలను నిర్వహించనున్నట్లు ఈఓ సత్యనారాయణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉదయం పది గంటలకు శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయం, 11 గంటలకు పార్వతీ సమేత విక్రమ భట్టేశ్వరస్వామి ఆలయ భూములకు, మధ్యాహ్నం 12 గంటలకు చండీ భైరవస్వామి ఆలయ భూములకు వేలం పాట జరుగుతుందన్నారు.

రక్షణ కరవైనది



గోదావరి నదీ గర్భంలోకి దిగబడిన గ్రోయిన్

- పల్లిపాలెం గ్రామానికి భద్రత కరవు
- గ్రోయిన్ల ఎత్తు పెంచాలని వినతి

సఖినేటిపల్లి: రక్షణ కరవైంది.. వశిష్ఠా గోదావరి నదీ ఆటుపోట్లతో పల్లిపాలెం గ్రామానికి నష్టం వాటిల్లుతోంది. సాగర సంగమానికి సమీపంలో వశిష్ఠ గోదావరి తీరాన్ని ఆనుకుని ఈ గ్రామం ఉండడంతో సముద్ర కెరటాల ధాటికి, గోదావరి ఆటుపోట్ల ప్రభావానికి గురవుతోంది. పౌర్ణమి, అమావాస్యలకు ఉండే ఆటుపోట్లతో పాటు, ప్రకృతి వైపరీత్యాలకు కెరటాలు రివిట్‌మెంట్‌ను దాటుకుని మరీ గ్రామంలోకి చొచ్చుకు వస్తున్నాయి. పల్లిపాలెం తీరంలో పుష్కర కాలానికి ముందు నిర్మించిన గ్రోయిన్లు, వాటి మధ్య రివెట్‌మెంట్ పూర్తిగా కుంగిపోయాయి. దీనివల్ల గ్రామానికి ముప్పుగా పరిణమించింది. నాటి పరిస్థితులకు తగ్గట్టుగా నిర్మించిన గ్రోయిన్లు ప్రస్తుతం నదీ గర్భంలోకి కుంగిపోతున్నాయి. నానాటికి దిగబడిపోతున్న గ్రోయిన్లు, చెల్లాచెదురవుతున్న రివిట్‌మెంట్ గ్రామ రక్షణకు సహకరించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

తీర గ్రామాలకు ముప్పు

పల్లిపాలెం గ్రామంతో పాటు అంతర్వేది దేవస్థానం, గొంది, గుడిమూల, రామేశ్వరం, సఖినేటిపల్లిలంక, సఖినేటిపల్లి, అప్పనరామునిలంక గ్రామాల్లో గోదావరి నదీ తీరం వెంబడి ముప్పు వాటిల్లుతోంది. ప్రధానంగా పల్లిపాలెంలో ప్రకృతి వైపరీత్యాలకు తోడు ఏటా జూలై, ఆగస్టు నెలల మధ్యలో వచ్చే వరదల ఉధృతికి కూడా రివిట్‌మెంట్ రాళ్లు గోదావరి నదిలోకి జారిపోతున్నాయని స్థానికులు అంటున్నారు. సముద్రానికి అతి సమీపంలోని గ్రామ రక్షణకు 2001లో అప్పటి రాజోలు ఎమ్మెల్యే ఏవీ సూర్యనారాయణ రాజు గోదావరి నదీకోత నివారణకు నాలుగు గ్రోయిన్లు, వాటి మధ్య రివెట్‌మెంటు నిర్మాణ పనులు పూర్తి చేయించారు. 2008లో అప్పటి రాజోలు ఎమ్మెల్యే అల్లూరు కృష్ణంరాజు సారథ్యంలో మరో నాలుగు గ్రోయిన్లు నిర్మించారు. పల్లిపాలెం చేపలరేవు వద్ద నుంచి గ్రామ శివారు 10వ వార్డు వరకూ సుమారు కిలోమీటరు పొడవు ఉన్న తీరంలోని 8 గ్రోయిన్ల ఎత్తు పెంచి, వాటి మధ్య చెల్లాచెదురవుతున్న రివిట్‌మెంట్‌ను పటిష్ఠపరచాలని ప్రజలు కోరుతున్నారు.



పల్లిపాలెం గోదావరి తీరం వెంబడి బలహీనపడిన రివిట్‌మెంట్

ప్రతిపాదనలు పంపించాం

నియోజకవర్గంలో నదీకోత నుంచి గ్రామాల రక్షణకు ప్రతిపాదనలు పంపించాం. ఇందుకు సుమారు రూ.200 కోట్ల మేర అంచనాలు రూపొందించాం. వీటిల్లో సఖినేటిపల్లి బోను వద్ద నుంచి సఖినేటిపల్లి రేవు వరకూ మూడు కిలోమీటర్ల మేర, అంతర్వేది, పల్లిపాలెం లిమిట్స్‌లో మరో మూడు కిలోమీటర్ల మేర గ్రోయిన్లు, రివిట్‌మెంట్‌కు ప్రతిపాదించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది.

–టీవీఎల్ఎస్ మూర్తి, హెడ్‌వర్క్స్ ఏఈ, రాజోలు

సాధారణ కాన్పులకు చర్యలు



బాలికల వసతి గృహంలో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న డీఎంహెచ్ఓ దొర

రాజోలు: గర్భిణులకు శస్త్ర చికిత్సలు తగ్గించి సాధారణ కాన్పులు చేసేందుకు జిల్లా స్థాయిలో కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎం.దుర్గారావు దొర తెలిపారు. గురువారం ఆయన మండలంలోని ప్రభుత్వ వసతి గృహాలను సందర్శించారు. వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై స్థానిక వైద్య సిబ్బందితో సమీక్షించారు. వసతి గృహాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేయాలని వసతి గృహ వార్డెన్లకు సూచించారు. రాజోలులోని బాలురు, బాలికల వసతి గృహాలతోపాటు, శివకోడు గురుకుల బాలికల పాఠశాల ఆవరణలను పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో గర్భిణులకు శస్త్ర చికిత్సలు చేస్తున్నారని, సాధారణ ప్రసవాలకు ప్రయత్నాలు జరగడం లేదన్నారు. ప్రతి 100 మంది గర్భిణుల్లో 80 మందికి కాన్పుల కోసం ఆపరేషన్లు చేస్తున్నారన్నారు. సాధారణ ప్రసవాలు చేసే విధంగా జిల్లా స్థాయిలో కమిటీ ఏర్పాటు చేసి ఆ కమిటీ ద్వారా ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగే ప్రసవాలపై దృష్టిసారిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రైవేటు ఆస్పత్రుల గైనకాలజిస్టులతో సమావేశం నిర్వహించి సాధారణ ప్రసవాలు చేసేలా ఆదేశాలు జారీ చేస్తామన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. డీఎంఓ ఎం.వెంకటేశ్వరరావు, తాటిపాక పీహెచ్‌సీ వైద్యాధికారులు ఫణికుమార్, మణికుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

అపూర్వం.. సమ్మేళనం



జొన్నాడలో ఎస్‌డీఎస్ఎన్ఆర్ జెడ్పీ హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఆలమూరు: ఆత్మీయత.. ఆప్యాయతతో కూడిన పలకరింపులతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆకట్టుకుంది. 13 ఏళ్ల తరువాత కలుసుకున్న నాటి విద్యార్థులు సందడి చేశారు. జొన్నాడలోని శ్రీద్వారంపూడి సత్యనారాయణరెడ్డి జెడ్పీ హైస్కూల్‌లో గురువారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 2007–12 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు గత స్మృతులను నెమరవేసుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వారంతా అలనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. సహచరులందరినీ వేదికపై తీసుకువచ్చిన కమిటీ సభ్యులైన కె.పూర్ణారెడ్డి, సురేందర్‌రెడ్డి, సూర్యచంద్ర, వీరబాబు, సుధీర్‌కుమార్‌లను పలువురు అభినందించారు.